నమస్తే తెలంగాణ

# సంగారెడ్డి

I | హైదరాబాద్, బుధవారం 22 మే 2024 | SANGAREDDY


# ఐదు రోజులైనా వడ్లు కొనడం లేదు

- రైతు సంతోశ్ ఆవేదన
- ఎక్స్ వేదికగా స్పందించిన మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు



చేగుంట, మే 21: కాంగ్రెస్ ప్రభుత్వం వడ్ల కొనుగోలులో చూపుతున్న తీవ్ర నిర్లక్ష్యానికి మెదక్ జిల్లాకు చెందిన రైతు సంతోశ్ కష్టాలే నిదర్శనమని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు ఎక్స్ వేదికగా వెల్లడించారు. వివరాల్లోకి వెళ్తే... చేగుంట మండలం పులిమామిడి కిష్టాపూర్ గ్రామానికి చెందిన సంతోశ్ సిద్దిపేట జిల్లా, బెజ్జంకి మండలం గాగిల్లాపూర్ అన్నపూర్ణ రైస్‌మిల్లుకు గ్రామం నుంచి ఐదు లారీల ధాన్యం పంపించి ఐదు రోజులైనా ప్రభుత్వ కొనడం లేదని, అధికారుల జాప్యంతో వర్షానికి ధాన్యం మొలకెత్తిందని, ఇప్పుడు కొనడం సాధ్యం కాదని అధికారులు చెబుతున్నారన్నారు. సంతోశ్ కాళ్లావేళ్లా పడితే లారీకి 50బస్తాలు తరుగు తీస్తేనే కొంటామని, లేకపోతే కొనమని నిర్లక్ష్యంగా సమాధానమివ్వడం సరికాదన్నారు. ఐదు రోజులుగా డ్రైవర్‌కు భోజన వసతిని సంతోశ్‌తోపాటు గ్రామస్తులు భరిస్తున్నారన్నారు. ప్రభుత్వం మొలకెత్తిన వడ్లను కొంటామని చెబుతున్నా అధికారుల నుంచి ఎలాంటి స్పందన లేదన్నారు. సంతోశ్ ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేశాడని ఎమ్మెల్యే హరీశ్‌రావు చెప్పారు. మెదక్, సిద్దిపేట జిల్లా కలెక్టర్లు, సంబంధిత అధికారులు స్పందించి రైతు సంతోశ్ సమస్యను పరిష్కరించాలని కోరారు.

## ఆటో ఉన్నా... లాభం లేకపాయే..



కోహీర్, మే 21: చాలా సంవత్సరాలుగా ఆటో నడుపుతూ వచ్చే పైసలతో నా కుటుంబాన్ని పోషించుకుంటున్న. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఫ్రీ అని పెట్టారు. దీంతో ఆడవాళ్లు ఆటోల్లో ఎక్కడమే మానేశారు. రోజుకు రూ.500 వచ్చేది గగనంగా మారింది. మా కుటుంబాన్ని ఎలా పోషించుకోవాలి. ఇంతకుముందు రోజూ రూ.2వేల వరకు వచ్చేవి. ఇప్పుడు మా పిల్లల చదువులు, ఖర్చులకు అప్పు చేయాల్సి వస్తున్నది. *–మల్లేశ్, ఆటోడ్రైవర్, కోహీర్*

## బతుకు ఆగమైంది...



ఆటో నడుపుతూ ఉన్న దాంట్లో సంతోషంగా బతికినం. మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం వచ్చినప్పటి నుంచి మా బతుకులు ఆగమైనయ్. కుటుంబాన్ని పోషించలేని పరిస్థితి వచ్చింది. పిల్లలను స్కూల్‌కు పంపేదెలా.. ఫీజులు కట్టేదెలా. రోజుకు వచ్చే రూ.500లతో కుటుంబం గడిచేదెలా. తలుసుకుంటేనే భయమేస్తున్నది. ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలి.

*– ఆర్.రాజు ఆటోడ్రైవర్, కంది*

## పిల్లల సదువులు భారమైనయ్



శివ్వంపేట, మే 21: మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న ఆటోడ్రైవర్ల పరిస్థితి గిరాకీ లేక బతుకు భారమైంది. 2018 నుంచి శివ్వంపేట మీదుగా నర్సాపూర్ నుంచి తూప్రాన్‌కు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషించుకుంటున్న. మాకు ఇద్దరు పిల్లలు. వారిని గతంలో ప్రైవేటు పాఠశాలలో చదివించా. గిప్పుడు ఉచిత బస్సులతో ఆటోలకు గిరాకీ అసలే లేవు. ఆర్థిక ఇబ్బందులతో పిల్లలను శివ్వంపేట ప్రభుత్వ పాఠశాలలో చేర్పించా. కాంగ్రెస్ ప్రభుత్వ విధానంతో ఆటో డ్రైవర్ల బతుకులు ఆగమైనయి. ప్రభుత్వమే ఆదుకోవాలి.

*–గుగులోత్ ప్రభాకర్, ఆటో డ్రైవర్, తాళ్లపల్లి తండా, శివ్వంపేట*



కంది: గిరాకీ లేక ఆటోలను చెట్టుకింద నిలిపిన దృశ్యం

# ఆటోవాలా.. బతుకు డీలా!

## రేవంత్ సర్కార్‌లో రోడ్డున పడ్డ ఆటోడ్రైవర్లు

- పొద్దంతా కష్టపడినా రూ.200 దాటని సంపాదన
- ఆటో కార్మికులను నమ్మించి మోసం చేసిన సీఎం రేవంత్
- ఫ్రీబస్సుతో నష్టపోతున్న ఆటోవాలాలకు ప్రతినెలా రూ. 20 వేలు ఇవ్వాలి
- ప్రభుత్వం ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి లేకపోతే ఆత్మహత్యలే శరణ్యమంటున్న ఆటోవాలాలు

గజ్వేల్, మే 21: రేవంత్ సర్కారుతో ఆటో డ్రైవర్ల బతుకులు భారంగా మారాయి. ప్రభుత్వం ఆటో డ్రైవర్ల పొట్టకొట్టి మహిళలకు ఉచిత ఆర్టీసీ బస్సు ప్రయాణాన్ని కల్పించడంతో లక్షలాది కుటుంబాలకు తీరని శోకాన్ని మిగిల్చింది. గజ్వేల్ నియోజకవర్గంలోనే సుమారుగా మూడు వేల పైచిలుకు కుటుంబాలు ఆటోలపై ఆధారపడి జీవనం సాగిస్తున్నాయి. గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మార్గంలో ప్రతి రోజూ సుమారుగా ఐదువందల ఆటోలు తిరుగుతాయి. ఉచిత బస్సు ప్రయాణంలో మహిళలు గజ్వేల్, ప్రజ్ఞాపూర్ వద్ద మొత్తంగా ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణం చేస్తున్నారు. ఆటోలు సిద్ధంగా ఉన్నా ఒక్కరూ కూడా ఎక్కేందుకు ముందుకురావడం లేదు. మహిళా ఉద్యోగులు సైతం బస్సుల కోసమే వేచి ఉంటున్నారు. గజ్వేల్, తూప్రాన్, జగదేవ్‌పూర్, ములుగు, వర్గల్, మర్కూక్, కొండపాక, కుకునూర్‌పల్లి మండల కేంద్రాల్లో నిత్యం వందలాది ఆటోలు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో కీలకంగా మారుతున్నాయి. ఆర్టీసీ బస్సు తిరగని గ్రామాలకు ప్రయాణికులను గమ్యస్థానాలకు చేర్చడంలో ఆటోలే ప్రధాన ఆధారం. అలాంటిది రేవంత్‌రెడ్డి సర్కార్ తీసుకున్న నిర్ణయంతో ఆ కుటుంబాల్లో రోజూ గడవడమే గగనంగా మారింది. బతకడమే కష్టంగా మారింది.



## ఆటోడ్రైవర్లకు అన్యాయం చేసింది..

హత్నూర, మే 21: ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం కల్పించి ఆటోడ్రైవర్లకు తీరని అన్యాయం చేసింది. రోజూ ఆటోతో అడ్డాపైకొచ్చి ప్రయాణికుల కోసం పడిగాపులు కాయాల్సిన దుస్థితి నెలకొంది. అప్పు చేసి ఆటో కొనుగోలు చేస్తే ఉపాధి కోల్పోయి అప్పు కట్టలేకపోతున్నా. కుటుంబ పోషణ, పిల్లల చదువులకు ఫీజుల భారం, చేసిన అప్పులు చెల్లించలేక మనోవేదనకు గురవుతున్నాం. ఇప్పుడు రేవంత్ ప్రభుత్వం ఆటోడ్రైవర్ల బతుకుపై దెబ్బ కొట్టే విధంగా ఉచిత బస్సు ప్రయాణం కల్పించడంతో బతకాలో చావాలో తెలియని పరిస్థితి నెలకొంది. మహిళలకు మేలు చేసినా నాలాంటి నిరుపేద ఆటోడ్రైవర్లకు మాత్రం తీరని అన్యాయం చేసింది ప్రభుత్వం. *– బట్టు మారుతిరాజు, ఆటోయూనియన్ అధ్యక్షుడు, దౌల్తాబాద్*

## బతుకుపై దెబ్బ కొట్టింది..

హత్నూర, మే 21: కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఆటోడ్రైవర్ల బతుకుదెరువుపై దెబ్బ కొట్టింది. ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం కల్పించడంతో ఆటోల్లో ప్రయాణికుల సంఖ్య తగ్గిపోయింది. దీంతో మహిళలు బస్సుల్లోనే ప్రయాణిస్తుండటంతో గంటల తరబడి ప్రయాణికుల కోసం ఎదురు చూడాల్సి వస్తుంది. ప్రైవేట్ ఫైనాన్స్‌లో అప్పు తీసుకొని ఆటో కొనుగోలు చేసి నెలకు రూ.8వేల కిస్తీ కట్టేది. ఇప్పుడు దందలు లేక కుటుంబాన్ని పోషించుకోవడానికే ఇబ్బంది పడుతుంటే నెలనెలా ఫైనాన్స్ ఎలా కట్టాలో అర్థం కావడం లేదు. గతంలో రోజుకూ ఖర్చులు పోనూ రూ.800 సంపాదిస్తే ప్రస్తుతం రూ.200 కూడా రావడం లేదు. రోజురోజుకూ పెరుగుతున్న ఖర్చులతో బతకడం భారమవుతున్నది. ప్రభుత్వం స్పందించి ఆటోడ్రైవర్లను ఆదుకోవాలి.

*– లక్ష్మారెడ్డి, ఆటోడ్రైవర్, హత్నూర*



## ఆటోడ్రైవర్లను ప్రభుత్వం ఆదుకోవాలి



వట్‌పల్లి, మే 21: కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు బస్సుల్లో ఉచిత ప్రయాణం కల్పించడంతో మా బతుకులు దుర్భరమయ్యాయి. ఆటోలు నడువకా... అప్పులు పుట్టకా... కుటుంబాలను పోషించుకునే పరిస్థితి కూడా కనిపించడం లేదు. ఓవైపు అప్పులు, మరోవైపు కుటుంబ భారం ఏం చేయాలో దిక్కుతోచడం లేదు. ప్రభుత్వం స్పదించి ఆటో డ్రైవర్లను ఆదుకోకపోతే ఆకలి చావులు చావాల్సి వస్తుంది.

*– చాకలి రాజు, ఆటోడ్రైవర్, వట్‌పల్లి*

## కాంగ్రెస్ కడుపు కొట్టింది



సిద్దిపేట టౌన్, మే 21: కాంగ్రెస్ పాలనలో ఆటో కార్మికులు ఉపాధిని కోల్పోయారు. రేవంత్ తెచ్చిన ఫ్రీ బస్సు వేలాది ఆటోడ్రైవర్ల కుటుంబాలను రోడ్డున పడేసింది. ఆటో కార్మికుల ఉనికి ప్రశ్నార్థకంగా మారింది. బీఆర్ఎస్ ప్రభుత్వం ఆటో కార్మికుల సంక్షేమాన్ని అకాంక్షిస్తూ అనేక పథకాలను అమలు చేసింది. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే మా పొట్ట కొట్టింది. సీఎం రేవంత్‌రెడ్డి ఆటో కార్మికులను నమ్మించి మోసం చేశాడు. ఫ్రీ బస్సుతో నష్టపోతున్న ఆటోవాలాలకు ప్రతినెలా రూ.20 వేలు ఇవ్వాలి. లేదంటే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపడుతాం.

*– బాయికాడి శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి, సిద్దిపేట ఆటో కార్మిక యునియన్*

## కిస్తీలు కట్టలేకపోతున్న...



మూడు నెలలుగా ఆటో కిస్తీలు కట్టడం భారంగా మారింది. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణంతో మా బతుకులు ఆగమయ్యాయి. అప్పట్లో ప్రతిరోజూ డీజిల్ ఖర్చులు పోనూ ఇంటికి రూ.600 నుంచి రూ.700 తీసుకపోయేది. ఇప్పుడు పొద్దంత కష్టపడినా రూ.200 తీసుకుపోతే మహా ఎక్కువగా ఉంటుంది. కిస్తీలు కట్టకపోతే ఎప్పుడు వచ్చి ఆటోను తీసుకుపోతారోననే భయం ఉంది. నేనే కాదు చాలామంది ప్రతినెలా కిస్తీలు కట్టలేక, కుటుంబం గడవక ఇబ్బందులు పడుతున్నారు. ఏడాదికి ఆటోడ్రైవర్లకు రూ.12వేలు ఇస్తామన్న ప్రభుత్వం ఇప్పటివరకు ఏమీ చేయలేదు. వచ్చేనెల పిల్లలకు పుస్తకాలు, యూనిఫాంలు కొనాలే. ఖర్చులు గుర్తొస్తే దిగులుగా ఉంది. 25ఏండ్లుగా ఆటో నడుపుతున్నా. ఇసుంటి పరిస్థితిని ఎన్నడూ చూడలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం మా బతుకులను ఆగం చేసింది. డ్రైవర్లంతా అరిగోస పడుతుండ్రు. *– యూసుఫ్‌ఖాన్, ఆటోడ్రైవర్, గజ్వేల్*

## ఆటోలకు గిరాకే లేదు..



హుస్నాబాద్ రూరల్, మే 21: హుస్నాబాద్‌లో 13 ఏండ్లుగా ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్న. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక మహిళలకు ఫ్రీ బస్సులు పెట్టింది. దీంతో ఆటోలకు మునుపటి లెక్క గిరాకే ఉంటలేదు. అంతకుముందు రోజూ రూ.600 నుంచి రూ.700 వచ్చేవి. వచ్చిన ఆదాయంతో ఆటోకు ఫైనాన్స్ కడుతూ భార్య,పిల్లలతో సంసారం వెళ్లదీసెటోడ్ని. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ఆటో ఫైనాన్స్ కట్టడమే ఇబ్బందిగా మారింది. ఆటో డ్రైవర్ల జీవితాలే నాశనమయ్యాయి. రోజులు గడిస్తే ఆటో డ్రైవర్లు కూలీలుగా మారాల్సిందే. ప్రభుత్వం ఆటోడ్రైవర్లకు ఏదైనా ఉపాధి చూపే మార్గం ఆలోచించాలె. *– మాటూరి ప్రేమ్‌కుమార్, ఆటో డ్రైవర్, హుస్నాబాద్*

## బతుకులు రోడ్డున పడ్డాయి..



మిరుదొడ్డి, మే 21: కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినంక...మా ఆటో కార్మికుల బతుకులు రోడ్డున పడ్డాయి. కేసీఆర్ ప్రభుత్వం ఉండగా ఆటో కార్మికులము ఎలాంటి ధోకా లేకుండా బతికినం. అప్పుడు ప్రతిరోజూ ఆటోకు డీజిల్ ఖర్చులు పోనూ రూ.500 వరకు ఇంటికి తీసుకొని పోయేటోళ్లం. గీ కాంగ్రెస్ ప్రభుత్వం అచ్చినంక తిండికే కష్టం వచ్చింది. ఫ్రీ బస్సులతో రోజంతా కష్టపడినా రూ.50 మాత్రమే దొరుకుతుంది. మేము ఎలా బతకాలే... పిల్లలను ఎట్లా సాకాలే..శాన ఇబ్బందిగా ఉంది. మా ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలి. *–ఎండీ. రఫీ, ఆటో కార్మికుడు, మిరుదొడ్డి*



అందోల్: గిరాకీ లేక ఖాళీగా ఉన్న ఆటోలు

## గింత ఇబ్బందులు ఎప్పుడూ పడలే..



పదేండ్ల నుంచి ఆటో నడపుతూ ఉన్నంతలో కుటుంబంతో సంతోషంగా జీవిస్తున్న. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చినప్పటి నుంచి మా పరిస్థితి దయనీయంగా మారింది. మహిళలకు ప్రభుత్వం బస్సుల్లో ఫ్రీ టికెట్ పెట్టడంతో మహిళలు ఆటోలు ఎక్కడమే మానేశారు. మహిళలతో పాటు మగవారూ అదే బస్సులో ప్రయాణించడంతో ఆటోడ్రైవర్ల పరిస్థితి దారుణంగా తయారైంది. ఉదయం లేవగానే అడ్డామీద పెడితే ఒక్కరో ఇద్దరో ఎక్కితే కూడా నష్టానికి సైతం పోవాల్సి వస్తున్నది. కాంగ్రెస్ ప్రభుత్వం ఎవరికి ఏం మంచి చేసిందో నాకు తెల్వదు, కానీ మా ఆటోడ్రైవర్‌లకు మాత్రం చెడు చేసింది.

*– తడకపల్లి ఆంజనేయులు, ఆటోడ్రైవర్, ఐనాపూర్*

## కొనుగోళ్లు వేగవంతం చేయాలి

*– ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరి*

దుబ్బాక, మే 21: ధాన్యం కొనుగోళ్లు వేగవంతం చేయాలని ఉమ్మడి మెదక్ జిల్లా ప్రత్యేకాధికారి భారతి హోళికేరి అన్నారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ'లో వచ్చిన 'ధాన్యం కొనుగోళ్లపై నిర్లక్ష్యం' అనే కథనంపై స్పందించారు. దుబ్బాక మండలం హబ్షీపూర్‌లోని ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం సందర్శించి రైతుల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొనుగోళ్ల వివరాలు, డబ్బుల చెల్లింపులు వివరాలను అడిగి తెలుసుకున్నారు. ధాన్యం తడవకుండా టార్పాలిన్ కవర్లను రైతులకు అందుబాటులో ఉంచాలని సూచించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ చివరి దశకు చేరుకుందన్నారు. అకాల వర్షాల వల్ల కొంత ఇబ్బందులు ఎదురైన విషయం వాస్తవమన్నారు. ఆమె వెంట సిద్దిపేట జిల్లా అడిషనల్ కలెక్టర్ (రెవెన్యూ) శ్రీనివాస్‌రెడ్డి, డీఆర్డీవో పీడీ జయదేవ్ ఆర్య, పౌర సరఫరాల శాఖ జిల్లా మేనేజర్ హరీశ్ , డీఎస్‌వో తనూజ, డీపీఎం కిరణ్‌కుమార్ , ఇన్‌చార్జి ఏపీఎం నర్సింహులు, డిప్యూటీ తహసీల్దార్ సందీప్, ఆర్ఐ నర్సింహారెడ్డి తదితరులున్నారు.



హబ్షీపూర్‌లో రైతుల సమస్యలు తెలుసుకుంటున్న ఉమ్మడి జిల్లా ప్రత్యేకాధికారి భారతిహోళికేరి

# మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు

వర్గల్,మే 21: ఎన్నికల హామీలు అమలు చేయకుండా అన్నివర్గాలను మోసం చేస్తున్న కాంగ్రెస్ సర్కారు రైతుల పాలిట శనిలా దాపురించిందని ఎఫ్‌డీసీ మాజీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం వర్గల్ మండలం మైలారంలో రైతులు, బీఆర్ఎస్ నాయకులతో కలిసి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అసెంబ్లీ ఎన్నికలప్పుడు ప్రజలకు ఇచ్చిన హామీలను భేషరతుగా అమలు చేయాలని డిమాండ్ చేశారు.అకాల వర్షాలతో రైతులు నష్టపోతుంటే సర్కారుకు కనీసం పట్టడం లేదన్నారు. పండించిన ధాన్యానికి మద్దతు ధర, రూ.500 బోనస్ ఇవ్వలేని ప్రభుత్వం రైతు రుణమాఫీ ఎలా? చేస్తుందన్నారు. వానకాలం దగ్గర పడుతున్నా అందుకు తగ్గట్టుగా అధికార యంత్రాంగాన్ని సమాయత్తం చేయడంలో కాంగ్రెస్ విఫలమమైందని విమర్శించారు. సన్నవడ్లు, దొడ్డు వడ్లు అని తేడాలేకుండా అన్ని రకాల వడ్లకు రూ.500 బోనస్ ఇచ్చి రైతాంగాన్ని ఆదుకోవాలని సూచించారు. సరైన సమయంలో కొనుగోళ్లు ప్రారంభించక పోవడంతో రైతులు రైస్‌మిల్లుల్లో తక్కువ ధరకే ధాన్యం అమ్మాల్సి వచ్చిందన్నారు.వానకు తడిసిన వడ్లను వెంటనే కొనుగోలు చేయాలన్నారు. పింఛన్ల పెంపు, తలం బంగారం, ఇంటి నిర్మాణానికి రూ. 5 లక్షల సాయం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం కరెంటు కూడా సరిగ్గా ఇవ్వడం లేదన్నారు.

## అన్ని వడ్లకు బోనస్ ఇవ్వాలి.. తడిసిన వడ్లను కొని రైతులను ఆదుకోవాలి



మైలారంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న వంటేరు ప్రతాప్‌రెడ్డి

# ధాన్యం సేకరణలో అలసత్వాన్ని సహించం

- సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి
- అందోల్ మండలంలో కొనుగోలు కేంద్రాల పరిశీలన
- సమస్యలు ఏకరువు పెట్టిన రైతులు
- పూర్తి ధాన్యం కొనుగోలు చేస్తామని భరోసా
- రైతులను ఇబ్బందులకు గురిచేస్తే చర్యలు తప్పవని హెచ్చరిక
- అందోల్ బాలికల పాఠశాల హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్



అందోల్‌లో రైతులతో మాట్లాడుతున్న సంగారెడ్డి కలెక్టర్ వల్లూరి క్రాంతి

నమస్తే తెలంగాణ ఎఫెక్ట్

అందోల్, మే 21: రైతుల నుంచి ధాన్యం సేకరణలో కొనుగోలు కేంద్రాల నిర్వాహకులు అలసత్వం ప్రదర్శిస్తే చర్యలు తప్పవని సంగారెడ్డి జిల్లా కలెక్టర్ వల్లూరి క్రాంతి హెచ్చరించారు. మంగళవారం 'నమస్తే తెలంగాణ' దిన పత్రికలో ప్రచురితమైన 'రైతుల కష్టం నీళ్ల పాలు' అనే కథనానికి కలెక్టర్ స్పదించారు. మంగళవారం స్థానిక అధికారులతో కలిసి అందోల్, కన్సాన్‌పల్లిలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించారు. అక్కడి రైతులతో మాట్లాడి సమస్యలు తెలుసున్నారు. ధాన్యం కొనుగోళ్లలో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇక్కడ పనిచేసే కొంత మంది సిబ్బంది ఇష్టా రాజ్యంగా ధాన్యం కొనుగోళ్లు చేస్తున్నారని, పైరవీకారులకు పెద్ద పీట వేస్తూ సామాన్య రైతులను పట్టించుకోవడంలేదని రైతులు కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. రాత్రనకా..పగలనకా ఇక్కడే పడిగాపులు కాస్తున్నామని, మీరైనా దయ తలిచి ధాన్యం త్వరగా కొనేలా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అకాల వర్షాలు పడుతున్నాయని, దీనిని దృష్టిలో పెట్టుకుని ఉదయం కేంద్రాలు ఓపెన్‌చేసి సేకరణ వేగంగా పూర్తిచేయాలన్నారు. గన్నీ బ్యాగులు, లారీల కొరత లేకుండా చూడాలన్నారు. ప్రతిరోజు ఐదు లారీల్లో ధాన్యం తరలించేలా చర్యలు చేపట్టాలన్నారు. చివరి ధాన్యం గింజ వరకు కొంటామని, రైతులు అధైర్య పడొద్దని కలెక్టర్ భరోసా ఇచ్చారు. మిల్లర్లు సైతం రైతులకు అండగా ఉండాలని, ఇచ్చిన కెపాసిటీని పూర్తి చేసి రైతులకు తమవంతు సహకారం అందించాలన్నారు. మిల్లులో స్పేస్(స్థలం) పెంచుకుని లారీలను వెంటనే అన్‌లోడ్ చేయించడంతో, పాటు వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ప్రతి సెంటర్‌లో సంబంధిత నిర్వాహకులు, సిబ్బంది అందుబాటులో ఉండి వరుస క్రమంలో ధాన్యం కొనాలన్నారు. సంచులు, లారీల కొరత, ఇతరత్రా సమస్యలు ఉంటే రైతులు నేరుగా తమ దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ సూచించారు. అనంతరం అందోల్ బాలుర, బాలికల పాఠశాల, అన్నాసాగర్ ప్రభుత్వ పాఠశాలల్లో ఏర్పాట్లను కలెక్టర్ పరిశీలించారు.అందోల్ బాలికల పాఠశాలను కలెక్టర్ విజిట్ చేసిన సమయంలో హెచ్‌ఎం, కొంతమంది టీచర్లు లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. నమస్తే తెలంగాణలో వార్త ప్రచురితం కావడం, వెంటనే కలెక్టర్ రావడంతో మంగళవారం ఆగమేఘాల మీద కొనుగోలు కేంద్రాల వద్ద లారీలు ప్రత్యక్షమై ధాన్యం లోడు చేయడం కనిపించింది. పాఠశాలను సందర్శించేందుకు వస్తున్నట్లు ముందే సమాచారం ఇచ్చినా ఇంత నిర్లక్ష్యంగా ఉంటారా? అంటూ డీఈవో ఫిర్యాదు చేయగా.. సంబంధిత హెచ్‌ఎంకు షోకాజ్ నోటీస్ జారీ చేసినట్లు డీఈవో తెలిపారు. కలెక్టర్ వెంట ఆర్డీవో పాండు, సివిల్ సప్లై మేనేజర్ కొండల్‌రావు, పౌరసరఫరాల అధికారి వనజాత, మెప్మా పీడీ గీత, ఏడీఏ అరుణ, ఏవో విజయరత్న తదితరులు పాల్గొన్నారు.

- మంజీరా రకం మామిడి ఉత్పత్తితో ప్రసిద్ధి
- 500 రకాల పండ్ల వంగడాలను రూపొందించడమే లక్ష్యం
- సంగారెడ్డి ఫలపరిశోధన కేంద్రం శాస్త్రవేత్త సుచిత్ర
- నోరూరించిన మామిడి పండ్ల ఫల ప్రదర్శన

# రెండోస్థానంలో సంగారెడ్డి ఎఫ్‌ఆర్‌ఎస్



మామిడి పండ్ల రకాలను పరిశీలిస్తున్న వీసీ నీరజాప్రభాకర్, శాస్త్రవేత్తలు, అధికారులు

సంగారెడ్డి, మే 21 : సంగారెడ్డిలోని ఫల పరిశోధన కేంద్రం పరిశోధనల్లో దేశంలో రెండోస్థానంలో నిలిచినట్లు పరిశోధన కేంద్రం సీనియర్ శాస్త్రవేత్త సుచిత్ర అన్నారు. మంగళవారం ఫల పరిశోధన కేంద్రంలో మామిడి పండ్ల ప్రదర్శన ఏర్పాటు చేశారు. ముఖ్యఅతిథిగా కొండా లక్ష్మణ్ బాపూజీ ఉద్యానవన విశ్వవిద్యాలయ వీసీ నీరజా ప్రభాకర్ హాజరయ్యారు. ప్రదర్శనను ప్రారంభించారు. జ్యోతి ప్రజ్వలన చేసి మామిడి రకాల ప్రదర్శనను ఆమె సందర్శించారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీనియర్ శాస్త్రవేత్త సుచిత్ర మాట్లాడుతూ.. నాటి నైజాం పాలనలో గుర్రాల పాకగా ఉపయోగించిన మైదానాన్ని నేడు ఫలపరిశోధన కేంద్రంగా ప్రభుత్వం తీర్చిదిద్దిని గుర్తుచేశారు. నైజాం పాలనలో నాటించిన మామిడి మొక్కలు, జామ తోటల పెంపకంతో దినదిన అభివృద్ధి చేస్తూ నేడు దేశంలో ప్రముఖ ఫల పరిశోధన కేంద్రంగా నిలవడం గర్వకారణమన్నారు. ఆసియాలోనే గుర్తింపు సాధించిన ఫల పరిశోధన కేంద్రంగా సంగారెడ్డి ఎఫ్‌ఆర్‌ఎస్‌కు పేరుందని గుర్తుచేశారు. ఇక్కడ నుంచి మేలు రకమైన వంగడాలను రూపొందించి దేశవ్యాప్తంగా అనేక ప్రాంతాలకు ఎగుమతి చేస్తున్నట్లు తెలిపారు. ఈ కేంద్రంలో రూపొందించిన మంజీర రకం మామిడి ఎంతో డిమాండ్ ఉన్నట్లు తెలిపారు. 477 రకాల వంగడాలను రూపొందించినట్లు సీనియర్ శాస్త్రవేత్త సుచిత్ర తెలిపారు. సంగారెడ్డి జిల్లాలో ప్రస్తుతం 15వేల ఎకరాల్లో మామిడి తోటలు పెంచుతున్నారని డీహెచ్‌ఎస్‌వో సోమేశ్వర్‌రావు అన్నారు. మామిడి తోటల్లో అంతర పంటలు వేసుకుని మంచి ఆదాయం పొందవచ్చని సూచించారు. 1988లో 267 రకాల మామిడి పండ్లు ఉండేవని, ప్రస్తుతం 477 రకాలకు పెరగడం సంతోషకరమన్నారు. కార్యక్రమంలో డైరెక్టర్ ఆఫ్ రీసెర్చ్ కిరణ్‌కుమార్, హరికాంత్, ఉద్యానవన అధికారి శ్రీధర్, మాధురి, మౌనిక, నితీశ్, రైతులు నర్సింహారెడ్డి, మాధవరెడ్డి తదితరులు పాల్గొన్నారు.